సాక్షి
మంచిర్యాల
సోమవారం । 1 । జూలై । 2024



'ట్రిపుల్' ట్రబుల్స్ ఎవరికీ పట్టవా?
బాసర ట్రిపుల్ఐటీ అంటే రాష్ట్ర వ్యాప్తంగా అందరికీ తెలిసిందే... కానీ ఇక్కడ చదివే విద్యార్థుల సమస్యలు మాత్రం ఎవరికీ తెలియవు.
8లో▸



ఇక సెలవు..
బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంత్యక్రియలను ఆదివారం ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో నిర్వహించారు. అభిమాన నేతకు కడసారి వీడ్కోలు పలికారు.
8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.3 /27.3

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ పెరుగుతుంది. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గిరిజన గ్రామాల్లో ఏఐకేఎంఎస్ ర్యాలీ



నాగారంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సంతాల్ ఆదివాసుల 167 ఏళ్ల తిరుగుబాటును స్మరిస్తూ మన భాషా, సంస్కృతి, రాజ్యాంగ హక్కుల రక్షణకై పోరాడాలని, మన అడవులను, ఖనిజ సంపదను కొల్లగొట్టే కార్పొరేట్లను ప్రతిఘటించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో హాజీపూర్ మండల ర్యాలీ, నాగారం, గఢ్‌పూర్ గ్రామాల్లో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.లాల్‌కుమార్ మాట్లాడారు. జూన్ 30వ తేదీ ప్రాధాన్యత కలిగిన రోజన్నారు. అడవులు, సహజ వనరుల రక్షణ, సంతాల్ ఆదివాసీలు చారిత్రాత్మక తిరుగుబాటు చేశారన్నారు. ఆ పోరాటంలో అమరులైన సిద్దు, కాను లాంటి ఆదివాసీ అమరుల త్యాగాలను స్మరించుకుంటూ సామాజిక, ఆర్థిక, సంస్కృతిపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు పాపయ్య, ఆదివాసీ నాయకులు సోనేరావు, శ్రావణ్‌కుమార్, టీకం జంగు, కోవ తిరుపతి, పెంద్రం రాకేశ్, కుర్సెంగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనధికార రేషనలైజేషన్ నిలిపివేయాలి



మాట్లాడుతున్న రవికుమార్

మంచిర్యాలఅర్బన్: ఎస్జీటీ బదిలీల్లో తక్కువ విద్యార్థులు సంఖ్య బడుల్లో అన్ని ఎస్జీటీ ఖాళీలను చూపకుండా రాష్ట్ర అధికారులు రేషనలైజేషన్ చేసి సగం ఖాళీలను మాత్రమే చూపడాన్ని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బగ్గని రవికుమార్ తీవ్రంగా ఖండించారు. మంచిర్యాలలో ఆదివారం మాట్లాడారు. మూత బడులు తెరిపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా అన్ని ఖాళీలు చూపి ఎస్జీటీ బదిలీలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయ బదిలీలు వెబ్‌సైట్ అనేక మార్లు హ్యాంగ్ అవడంతో ఎస్జీటీలు సకాలంలో ఆప్షన్ పెట్టుకోలేకపోతున్నారన్నారు. వందల సంఖ్యలో ఖాళీలను ఎంచుకుని వరుస క్రమంలో ఆప్షన్స్ పెట్టడానికి ఒకరోజు సమయం సరిపోదని, వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపం తలెత్తినందున మరో రెండు రోజులు సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ద్విచక్ర వాహన స్టాండ్ నిర్వహణ గాలికి


- ఆదాయం కోల్పోతున్న ఆర్టీసీ



స్టాండ్‌లో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల బస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ద్విచక్ర వాహన స్టాండ్ నిర్వహణను గాలికొదిలేశారు. గతంలో సంస్థతో కుదుర్చుకున్న టెండర్‌దారునితో ఒప్పందం ముగిసింది. రెండు నెలలు గడిచినా కొత్త టెండర్ కేటాయించలేదు. దీంతో ఆర్టీసీ ఆదాయం కోల్పోతుంది. నెలకు టెండర్‌దారు నుంచి రూ.50 వేలకుపైగా ఆదాయం వచ్చేది. ప్రస్తుతం కొత్త టెండర్ పిలవకపోవటంతో ఇష్టానురీతిన వారు బైక్ స్టాండ్‌లో వాహనాలు నిలిపి వెళ్లిపోతున్నారు. ఇంకోవైపు ప్రధాన ముఖద్వారం వద్ద వాహనాలు నిలిపిఉంచటంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆర్టీసీ బైక్‌స్టాండ్‌లకు వేలం నిర్వహించాని కోరుతున్నారు.

జాతీయ శతాధిక సాహిత్య సమ్మేళనంలో రవితేజ



సాహిత్యాన్ని వినిపిస్తున్న రవితేజ

జైపూర్: జైపూర్ మండలం బెజ్జాల గ్రామానికి చెందిన మంతెన రవితేజ సూర్యపేట జిల్లా సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవసంస్థ శ్రీశ్రీ కళవేదిక, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ శతాధిక సాహిత్య కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవితేజ ప్రేయసి అంటే అనే తన ప్రేమ కవిత్వాన్ని ఆలపించారు. అనంతరం ఆయన ఆలపించిన సాహిత్యానికి ప్రశంసాపత్రం అందజేసి జ్ఞాపికతో సన్మానించారు.

ఆటపాటలతో చదువు..

- పూర్వ ప్రాథమిక విద్యపై ప్రభుత్వం దృష్టి
- అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధన
- ప్రత్యేక పుస్తకాలు సరఫరా
- టీచర్లకూ పాఠ్యాంశాలపై శిక్షణ




అంగన్‌వాడీ టీచర్లకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న సీడీపీవో విజయలక్ష్మి

మంచిర్యాలటౌన్: చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే బొమ్మలు, పాటల రూపంలో చిన్నారులకు విద్యను అందిస్తున్నారు. ఈ ఏడాది నుంచి పాఠ్యపుస్తకాల ద్వారా విద్యాబోధన చేపట్టనున్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను తప్పనిసరి. ఈ క్రమంలో కొత్త రకం పాఠ్యపుస్తకాలను రూపొందించారు. ఇందులో వారంలో ఏమేమి బోధించాలి, ఈ నెలలో ఏయే పాఠ్యాంశాలను చెప్పాలనే ప్రణాళికను సైతం అందులో ముద్రించింది.

టీచర్లకు శిక్షణ..
నూతన విద్యాబోధనకు అనుగుణంగానే చిన్నారులకు పాఠాలు చెప్పేలా అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజులు శిక్షణ ఇచ్చారు. ప్రతీ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి నుంచి ఇద్దరు సూపర్‌వైజర్లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చిన అనంతరం, వారితోనే ఆయా ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లను 30 నుంచి 35 మందిని ఒక బ్యాచ్‌గా చేసి, మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు పాఠ్యాంశాల్లోని అంశాలను నిర్బంధ విద్యలా కాకుండా, ఆటాపాటలతో చిన్నారులు ఉల్లాసంగా గడుపుతూ నేర్చుకునేలా బోధించేందుకు టీచర్లకు శిక్షణ అందించారు. పౌష్టికాహారంతోపాటు, పూర్వ ప్రాథమిక విద్య అంగన్‌వాడీ కేంద్రాలలో అందనుండగా, కేంద్రాలకు వచ్చే చిన్నారులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. దీంతో ప్రైవేటులో ప్లేస్కూల్స్‌కు వెళ్లే చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది.

ప్రతీ టీచర్ బోధించేలా....
జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 40,297 మంది చిన్నారులు ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తుండగా, చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాల్సి ఉంది. కొన్ని కేంద్రాల్లో టీచర్లు మొక్కుబడిగా చిన్నారులకు విద్యాబోధన చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఈక్రమంలో ప్రభుత్వం పూర్వ ప్రాథమిక విద్యను తప్పనిసరి చేసింది. ఈమేరకు చర్యలు చేపట్టింది. దీంతో ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యాబోధన చేయాలి.



కేంద్రాలకు పుస్తకాలు..
ఈ ఏడాది పిల్లల సంఖ్యకు అనుగుణంగా రెండు రకాల పాఠ్యపుస్తకాలను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేశారు. అందులో 'ప్రియదర్శిని', 'పూర్వ ప్రాథమిక విద్య కరదీపిక' ఉన్నాయి. పిల్లలకు ఏయే రోజు ఏయే అంశాలను నేర్పించాలి, నేర్చుకునే అంశాలను ఆటాపాటల రూపంలో ఏవిధంగా అందించవచ్చో అందుకు అనుగుణంగా పుస్తకాలను ముద్రించారు. 9 పాఠ్యాంశాలను 43 వారాల ప్రణాళికలుగా రూపొందించారు. శిక్షణలో టీచర్లకు అదేవిధంగా శిక్షణ అందించారు. ఇందుకోసం అంగన్‌వాడీ టీచర్లకు సహాయంగా ఉండేందుకు 'పూర్వ ప్రాథమిక విద్యా దీపిక' పుస్తకాన్ని అందించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు టైంటేబుల్‌ను అందించారు. ప్రతీ అరగంటసేపు ఒక్కో అంశంపై చిన్నారులకు బోధన జరిగేలా టైంటేబుల్ రూపొందించారు. దీనిని ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో అమలు చేసేలా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిత్యం పరిశీలించి, ప్రతీ టీచర్ చిన్నారులకు బోధన చేసేలా చూడనున్నారు.

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

ప్రాజెక్టు పేరు	అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారులు
బెల్లంపల్లి	279	10,827
చెన్నూరు	245	7,854
లక్సెట్టిపేట్	203	8,218
మంచిర్యాల	242	13,398
మొత్తం	969	40,297

చిన్నారులకు యూనిఫాం..
నూతన విద్యావిధానంలో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన 3 ఏళ్ల నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు యూనిఫాం కూడా అందించనున్నారు. ప్రతీ విద్యార్థికి రెండు జతల యూనిఫాం అందిస్తారు. ఇందుకు అవసరమైన వస్త్రం కూడా జిల్లాకు చేరింది. వీటిని కుట్టించే బాధ్యతను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు అప్పగించారు.

ప్రతీ టీచర్‌కు శిక్షణ..



అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు, ఆటాపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలను తీసుకుంటుంది. అందులో భాగంగానే శిక్షణ పొందిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో అంగన్‌వాడీ టీచర్లకు పాఠ్యాంశాల బోధనపై మూడు రోజుల శిక్షణ అందిస్తున్నాం. ప్రతీ చిన్నారికి విద్య అందేలా పటిష్టమైన చర్యలను తీసుకోవడంతోపాటు, అన్ని కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తాం.
– చిన్నయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రాజు

బెల్లంపల్లి: సమాజంలో అట్టడుగు స్థానంలో ఉన్న ఎరుకల జాతి అభివృద్ధికి ప్రభుత్వం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టోకిని రాజు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. అనాది నుంచి ఎరుకల సామాజికవర్గం ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదుగు బొదుగులేకుండా ఉందన్నారు. నాగరిక జీవనానికి నోచుకోకుండా సంచార జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. దుర్భర జీవితం గడుపుతున్న ఎరుకల సామాజిక వర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు రావడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్లు కేటాయించాలని సూచించారు. పందుల పెంపకమే జీవనాధారంగా బతుకున్న తమ సామాజికవర్గం ఏర్పాటు చేసుకున్న సహకార సంఘాలకు నిధులు కేటాయించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పందుల పెంపకం కోసం ఎరుకల ఎంపవర్‌మెంట్ కింద రూ.60 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల ఎరుకల కుటుంబాలు ఉన్నాయని వీరంతా కూడా పందుల పెంపకం చేస్తూ సమాజానికి దూరంగా ఉంటూ కుల వృత్తి చేసుకోవడానికి తంటాలు పడుతున్నారని వివరించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎరుకలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల బాపు, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు శ్రీరాముల రమేశ్, నాయకులు శ్రీరాముల ముత్తన్న, దుర్గమ్మ, రేవెల్లి బుచ్చమ్మ, సుల్తాన్ సుశీల, దుగ్యాల పుష్ప, బానేష్, మల్లేశ్, బిజిలి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలపై రౌండ్ టేబుల్ సమావేశం



రౌండ్ టేబుల్ సమావేశంలో అభిప్రాయాలు సేకరిస్తున్న జేఏసీ నాయకులు

- భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వక్తలు
- 24 వార్డుల్లో 1/70 యాక్ట్
- ఎన్నికల నిర్వహణకు కలిసి రావాలని జేఏసీ పిలుపు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ ఏర్పడి సుమారు 30 ఏళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో ప్రజాప్రతినిధులు లేక పట్టణంలో సమస్యలు పేరుకుపోతున్నాయి. ఆశించిన మేరకు అభివృద్ధి చెందడం లేదు. ఎన్నికలు నిర్వహించాలని గతంలో పోరాటాలు చేసిన స్థానికులు తాజాగా మరో ఉద్యమానికి తెరలేపారు. మున్సిపల్ ఎన్నికల సాధన జేఏసీ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయసేకరణ మొదలుపెట్టారు. దానిలో భాగంగా పట్టణంలోని అంగడిబజార్ ఏరియాలో శివాలయం సమీపంలోని పద్మశాలీ భవన్‌లో ఆదివారం పార్టీలకు అతీతంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న వక్తలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. 1/70 యక్ట్ అమలో ఉన్న మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరపాలని ఇది వరకు ఎమ్మెల్యేలు ఎంతో కృషి చేశారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు జరపాలంటే రాష్ట్రపతి ఆమోదం కచ్చితంగా అవసరమని పేర్కొన్నారు. ఎన్నికలు జరగాలంటే మరో తెలంగాణ ఉద్యమం అవసరమని పలువురు తెలిపారు. తెగించి కొట్లాడితేనే ప్రభుత్వం దిగివస్తుందన్నారు. ఎన్నికలు లేకపోవడంతో మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులు అభివృద్ధికి నోచుకోవడంలేదని పేర్కొన్నారు. సుమారు 60 వేల జనాభాకు ప్రజాప్రతినిధులు లేకుండా ఉందని, సమస్య ఏర్పడితే ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి నెలకొందని అభిప్రాయపడ్డారు. మున్సిపల్ ఎన్నికల కోసం జేఏసీ ఏర్పడి ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఉద్యమమే చివరిది కావాలని ఎలాంటి రిజర్వేషన్ తోనైనా కచ్చితంగా ఎన్నికల నిర్వహణ జరిగే వరకు పోరాడాలని పలువురు పేర్కొన్నారు.

ప్రభుత్వం చొరవ చూపాలి..



మందమర్రి మున్సిలిటీకి ఎన్నికలు నిర్వహించకపోవడంతో గతంలో గ్రామ పంచాయితీగా ఉన్న ఊరు మందమర్రికి తీరని అన్యాయం జరుగుతుంది. అభివృద్ధి పేరిట వచ్చే నిధులు ఊరు మందమర్రికి ఉపయోగపడడం లేదు. గతంలో మాదిరిగా ఊరుమందమర్రి, నార్లపూర్, ఊరు రామకృష్ణాపూర్ గ్రామ పంచాయతీలుగా చేసి మిగిలిన కళ్యాణిఖని పేరిట ఉన్న భూభాగానికి మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించకుంటే ఎలాంటి అభ్యంతరం ఉండదు. ఈమేరకు ప్రభుత్వం చొరవ చూపాలి.
– మేసినేని రాజయ్య, ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు

ఐక్యంగా పోరాడాలి..



మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు ఉండగా 24 వార్డుల్లోనూ 1/70 యాక్ట్, గిరిజన చట్టం అమల్లో ఉంది. 1/70 యాక్ట్‌కు ఊరు మందమర్రికి మినహాయింపు లేదు. ఎన్నికల నిర్వహణకు ఐక్యంగా పోరాడాలి. ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ గొడం నగేశ్‌లాంటి వారి సూచనలతో ఎన్నికల నిర్వహణ కోసం చేసే పోరాటం అర్ధంతరంగా నిలిపివేయొద్దు. పోరాటంలో అందరూ కలిసిరావాలి. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలపై అసెంబ్లీలో ప్రస్తావించారు.
– జెంగిలి రవీందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, మందమర్రి

కేజీబీవీలో బోధకులేరి..?



- బోధనేతర సిబ్బందీ కొరతే..
- భర్తీపై నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- విద్యార్థుల చదువులపై ప్రభావం

మంచిర్యాలఅర్బన్: గ్రామీణ ప్రాంత, నిరుపేద, అనాథ బాలికల కోసం ఏర్పాటు చేసిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ)పై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. కొన్ని కేజీబీవీల్లో ఇంటర్‌లో మినహాయిస్తే ఆరు నుంచి పదోతరగతి వరకు సీట్లు నిండిపోయాయి. సీట్ల కేటాయింపు కంటే అధికంగా ప్రవేశాలు వస్తున్నా కేజీబీవీలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకం లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సబ్జెక్టు టీచర్ లేక తరగతి బోధన కత్తిమీద సాములా మారింది. పాఠశాలలు పునఃప్రారంభమై 20 రోజులు కావొస్తోంది. జిల్లాలో కేజీబీవీల్లో ఖాళీగా ఉన్నా పోస్టుల భర్తీపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఉపాధ్యాయుల కొరత విద్యార్థుల చదువులపై ప్రభావం చూపనుంది.

ఖాళీలు ఇలా..
జిల్లాలో 18 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్లు(సీఆర్‌టీలు) 145 పోస్టులు మంజూరు కాగా, 142 మంది ఉన్నారు. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీజీసీఆర్‌టీలు 215 పోస్టులకు 200 మంది విధులు నిర్వహిస్తున్నారు. 15 ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. బోధనేతర సిబ్బంది ఏఎస్ఎం, కంప్యూటర్ ఆపరేటర్, స్వీపర్, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్ ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. 244 మందిగాను 195 మంది విధులు నిర్వహిస్తున్నారు. 49 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 200 మందిపైగా విద్యార్థులుండే కేజీబీవీలలో వంట మనుషులు లేకపోవటంతో అల్పాహారం నుంచి భోజనం వరకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వంట ఆలస్యం కావడంతో విద్యార్థులు సకాలంలో తరగతులకు హాజరుకాలేని పరిస్థితి ఉంటుంది. ప్రస్తుత ఖాళీలతోపాటు గురుకులాల్లో టీజీటీ, జేఎల్‌గా కొందరు వెళ్లనున్నారు. దీంతో మరిన్ని ఖాళీలు ఏర్పడనున్నాయి.

ఉన్నతాధికారుల ఆదేశానుసారం..
కేజీబీవీల్లో ఖాళీల వివరాలు సేకరించి నివేదించాం. ఉన్నతాధికారుల ఆదేశానుసారం పోస్టులను భర్తీ చేయనున్నాం. ఆదేశాలు ఎప్పుడు వచ్చినా ఖాళీలు భర్తీ చేస్తాం. కేజీబీవీల్లో చదివే విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం.
– యశోధర, సెక్టోరియల్ అధికారి, మంచిర్యాల

ఒకే వ్యక్తికి మూడు ఉద్యోగాలు



సాయికిరణ్

దండేపల్లి: దండేపల్లి మండల కేంద్రానికి చెందిన పెండ్యాల సత్యనారాయణ-శకుంతల కుమారుడు పెండ్యాల సాయికిరణ్ మూడు ఉద్యోగాలు సాధించాడు. సాయికిరణ్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్, మహారాష్ట్రలోని దపోలీ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ పూర్తి చేశాడు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ, గ్రూప్-4, ఇండియన్‌బ్యాంక్, మండల వ్యవసాయ అధికారి ఉద్యోగాల కోసం పరీక్షలు రాశాడు.. ఇందులో గ్రూప్-4లో జిల్లా 14వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఇండియన్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాడు. ఇటీవల విడుదలైన మండల వ్యవసాయ అధికారి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 42వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సాయికిరణ్ మూడు ఉద్యోగాలకు ఎంపికవ్వడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏవో ఉద్యోగానికి ఎంపిక..



స్పందనను సన్మానిస్తున్న జగిత్యాల డిప్యూటీ కలెక్టర్..

జన్నారం: మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన జాడి రాజలింగం-రేణుక దంపతుల కూతురు స్పందన మండల వ్యవసాయ అధికారి ఉద్యోగానికి ఎంపికైంది. ఆమెను జగిత్యాల డిప్యూటీ కలెక్టర్ చిత్రుపటేల్ ఆదివారం పొనకల్‌లో అభినందించారు. 2022లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేసిన స్పందన, 2023 జనవరిలో భారత ఆహార సంస్థ నిర్వహించిన ఉద్యోగ పరీక్షలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి మంచిర్యాలలో ఉద్యోగం చేస్తున్నారు. 2023 మేలో నిర్వహించిన మండల వ్యవసాయ అధికారిగా ఉద్యోగ పరీక్షల ఫలితాలు తాజాగా విడుదల కాగా ఏవో ఉద్యోగం సాధించింది. తమ కూతురు ప్రభుత్వ కొలువులు సాధించినందుకు సంతోషంగా ఉందని స్పందన తల్లిదండ్రులు తెలిపారు.

విద్యావేత్తకు మహానంది అవార్డు

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన విద్యావేత్త బాయి జమ్మ సాయి సేవా ట్రస్ట్ నిర్వాహకుడు కాంపల్లి శంకర్‌ను ప్రతిష్టాత్మక మహానంది అవార్డు వరించింది. భారత మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు జయంతి పురస్కరించుకుని కరీంనగర్ ఫిల్మ్‌భవన్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో జాతీయ పురస్కారాలు ఆదివారం ప్రదానం చేశారు. జ్యోతిర్ వాస్తు సేవలు అందించడంలో విశేషంగా కృషి చేసినందుకు కాంపల్లి శంకర్‌ను మహానంది అవార్డుకు ఎంపిక చేశారు. తెలుగు వెలుగు సాహితి వేదిక నిర్వాహకులు పోలోజు రాజ్‌కుమార్, బానాల రాజుచారి, అద్దంకి కృష్ణమాచారి, యూట్యూబ్ స్టార్ ఆర్ఎస్.నంద తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీత శంకర్‌ను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.



అవార్డు అందుకుంటున్న శంకర్

నిధులు రాక.. నిర్వహణ భారమై..!

- ఇదీ రైతు వేదికల దుస్థితి..



దండేపల్లి మండలం మేదరిపేట రైతువేదిక..

దండేపల్లి: వ్యవసాయ శాఖ సేవలను రైతులకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం క్లస్టర్ల వారీగా రైతు వేదికలను నిర్మించింది. మూడు, నాలుగు గ్రామాలకు కలిపి ఒక క్లస్టర్ ఏర్పాటు చేసింది. ఇలా జిల్లా వ్యాప్తంగా 55 రైతు వేదికలను నిర్మించారు. ఒక్కో దానికి సుమారుగా రూ.22 లక్షలకు పైగా వెచ్చించారు. ప్రస్తుతం వీటి నిర్వహణ ఆర్థికంగా భారమవుతోంది. ఏడాది నుంచి నిర్వహణ నిధులు రావడం లేదు. ఏఈవోలు రైతువేదికల్లో అందుబాటులో ఉండి, పంటల సాగులో రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించడంతోపాటుగా, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాల అమలు, వాటిపై దరఖాస్తుల స్వీకరణ, సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలి. కొత్తగా ప్రతీ మంగళవారం రైతు నేస్తం, ప్రతీ శుక్రవారం రైతులకు శిక్షణ ఇవ్వాలి. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ, నిర్వహణకు మాత్రం నిధులు రాకపోవడంతో, ఇబ్బందులు మొదలయ్యాయి.

ఇదీ పరిస్థితి...
రైతు వేదిక నిర్వహణకు ప్రతీనెల ఖర్చుల కింద రూ.9 వేలు ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని విద్యుత్ చార్జీలు, తాగునీరు, గదుల శుభ్రం చేయించడం, స్టేషనరీ, జిరాక్సు, శానిటరీ, మినీ లైబ్రరీ, చిన్నచిన్న మరమ్మతులు, రైతు శిక్షణకు వినియోగించాలి. కానీ ఈ నిర్వహణ నిధులు 2022 ఆగస్టు నుంచి విడుదల కావడం లేదు. దీంతో అప్పటి నుంచి చిన్న చిన్న నిర్వహణ ఖర్చులను ఏఈవోలు భరిస్తున్నారు. ఇక కరెంటు బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం రైతు వేదికల నిర్వహణకు నిధులు విడుదల చేసి, ఇబ్బంది లేకుండా చూడాలని రైతుల కోరుతున్నారు.

నిధులు రాలేదు..
రైతు వేదిక నిర్వహణకు ఏడాదికిపైగా నిధులు రావడం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే జిల్లాలోని రైతు వేదికలకు కేటాయిస్తాం.
– సురేఖ, డీఏవో, మంచిర్యాల

ఇక సెలవు..



భౌతిక ఖాయం వద్ద నాయకుల నివాళులు

- ముగిసిన రాథోడ్ రమేశ్ అంత్యక్రియలు
- అంతిమ యాత్రలో కిక్కిరిసిన జనం..
- ముఖ్య నేతల నివాళులు

ఉట్నూర్‌రూరల్: బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంత్యక్రియలను ఆదివారం ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో నిర్వహించారు. అంతకుముందు ఉదయం 11గంటలకు పాత ఉట్నూర్, పెర్కగూడ మీదుగా ఎక్స్‌రోడ్డు వరకు అంతిమయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ – మంచిర్యాల ప్రధాన రహదారులు జనాలతో కిక్కిరిసిపోయాయి. శనివారం రాత్రి 2 గంటలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాథోడ్ రమేశ్ స్వగృహానికి చేరుకొని పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఎంపీగా, జెడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్యేగా రాథోడ్ రమేశ్ చేసిన సేవలను కొనియాడారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్సీలు పురాణం సతీశ్, రాములు నాయక్, ఎమ్మెల్యేలు జాదవ్ అనీల్, రామారావు పటేల్, మాజీ మంత్రులు ఐకేరెడ్డి, జోగు రామన్న అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మంత్రి సీతక్క బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పెద్ద ఎత్తున రాథోడ్ రమేశ్ అభిమానులు తరలిరావడంతో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న ఐకేరెడ్డి, జోగు రామన్న, పురాణం సతీశ్, వెడ్మ బొజ్జు



అంత్యక్రియలకు హాజరైన ప్రజానీకం

'ట్రిపుల్' ట్రబుల్స్ ఎవరికీ పట్టవా?

- విద్యార్థుల ఇబ్బందులు పట్టించుకోరు
- వారికి మాట్లాడే అవకాశం కూడా లేదు..
- క్యాంపస్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టదు..
- వర్సిటీలో అంతా రహస్యమేనా?

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ అంటే రాష్ట్ర వ్యాప్తంగా అందరికీ తెలిసిందే... కానీ ఇక్కడ చదివే విద్యార్థుల సమస్యలు మాత్రం ఎవరికీ తెలియవు. ఏం జరిగినా గుట్టుగా ఉంచడం రహస్య క్యాంపస్‌గా మార్చడమే ఉన్నతాధికారుల లక్ష్యంగా కనిపిస్తోంది. చదువుకునే పిల్లలకు జైలు వాతావరణం తలపించే పరిస్థితులు కనిపిస్తున్నా ఏ ఒక్కరూ నోరు మెదపడం లేదు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఓ కమిటీ వేసుకుందామన్నా అనుమతించడం లేదు. కమిటీ కోసం దరఖాస్తు చేసుకుంటే ఏదో ఒక వంక చూపి విద్యార్థులను ఇబ్బందులు పెట్టడమే కాకుండా వారికి కమిటీ వేసుకునే పరిస్థితులను మరింత క్లిష్టం చేస్తున్నారు. విద్యార్థుల ఆందోళనలు, నిరసనలు ఇలా ఎదో ఒక విషయంలో ట్రిపుల్‌ఐటీ ఎప్పుడూ వార్తల్లో కనిపిస్తున్నా శాశ్వత పరిష్కారం మాత్రం ఎవరూ చూపడం లేదు. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలకు సైతం పాల్పడ్డారు. బాసర ట్రిపుల్‌ఐటీ రహస్య క్యాంపస్‌గా మారింది. అక్కడ ఏంజరిగినా బయటకు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. మీడియా, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, మేధావులు ఎవరైనా సరే లోపలికి మాత్రం అనుమతించరు.

ఆందోళనకు సిద్ధమవుతున్న విద్యార్థులు..

మరోవైపు తమ సమస్యల పరిష్కారం కోసం ఇక్కడ చదివే విద్యార్థులంతా ఆందోళనకు సిద్ధమవుతున్నారు. రెండేళ్ల క్రితం చేపట్టిన ఉద్యమంలాగే ఇప్పుడు కూడా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. గతంలో కొంతమంది విద్యార్థులే టార్గెట్‌గా చేసి కేసులు పెట్టారు. ఇప్పుడు విద్యార్థులంతా ఐక్యంగా వెళ్లి తమ సమస్యలు వినిపించి కమిటీ వేసి పోరాడాలని ఆలోచిస్తున్నారు. క్యాంపస్ అధికారులు కమిటీకి అనుమతించాలని కోరుతున్నారు. నిబంధనల పేరిట కాలయాపన చేస్తే విద్యార్థులంతా ఐక్యంగా నిరసనలకు దిగాలని నిర్ణయించారు. తమ సమస్యలను వినకుంటే నిరవధిక ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. ఏళ్ల తరబడి సమస్యలతో సహవాసం చేస్తున్న తమ ఇబ్బందులు తీర్చే మార్గం చూపాలని కోరుతున్నారు. ముదోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ జనవరిలో అసెంబ్లీలోనూ ట్రిపుల్ ఐటీ ప్రక్షాళన చేపట్టాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి పెట్టి ట్రిపుల్ ఐటీ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

భరోసా లేక...

తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసాగా ఉంటుందనుకునే ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్‌ఐటీలో ఇటీవలి కాలంలో వరుసగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా మరో విద్యార్థి తన నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాడు. వేలాది మంది ఉండే ఈ క్యాంపస్‌లో చదివే విద్యార్థులకు మనోధైర్యం ఇచ్చే వాళ్ళు లేకపోవడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. రోజూ చదివే విద్యార్థులపై యూనివర్సిటీ అధికారులు దృష్టి పెట్టలేకపోతున్నారు. 9వేల మంది విద్యార్థులు ఉండే ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో తరగతి గదుల్లో నీరసంగా, అసహనంగా, ఒంటరిగా ఉండే వారిని పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి మనోధైర్యాన్ని కల్పిస్తే ఆత్మహత్యలు కాస్తయినా ఆగుతాయి. విద్యార్థులు ఒత్తిడిలో చదువుతారు. చదువు పూర్తవుతున్న సమయంలోనూ ప్లేస్‌మెంట్, కుటుంబ పరిస్థితులు ఇతర వ్యసనాలు వారిలో పదేపదే మానసిక ఒత్తిడిని పెంచుతుంటాయి. ఈ ఒత్తిడిని తగ్గించేలా క్యాంపస్‌లో క్రీడలు, సంగీతంపై మక్కువ పెంచేలా చూడాలి. వారానికి ఒక్కరోజైనా విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య అన్నింటినీ మరిచి మానసిక ప్రశాంతతను పొందేలా వారిని ప్రేరేపించాలి. ఇష్టమైన రంగంలో ఆటలు ఆడుకునేవీలు కల్పించాలి. ఎంతోమంది విద్యార్థులు ఉన్న ఈ క్యాంపస్‌లో అప్పుడప్పుడు వినోదాన్ని పంచే కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులంతా ఒంటరిగా ఉండకుండా ఎవరితోనైనా తమ బాధలు చెప్పుకునేలా పరిస్థితులు కల్పించాలి. భయం మధ్య, ఏంజరుగుతుందోనన్న క్షణాల మధ్యతరగతి గదుల్లో, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు ఇలా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.



బాసర ట్రిపుల్ ఐటీ

విద్యార్థులు ప్రతీరోజు ఆటలు ఆడుకునేలా షెడ్యూల్ ఉంచాలి. ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు స్నానాలు, భోజనాలు, తరగతి గదులు వీటితోనే రోజు పూర్తవుతుంది. రోజుకు అరగంటైనా విద్యార్థులంతా ఇష్టమైన క్రీడల్లో పాల్గొనేలా ఏ ఒక్కరూ చూడడంలేదు. క్రీడల్లో ఉన్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి కాస్త దూరమవుతారు. వారంలో ఒక్కరోజైనా చెవులకు ఇంపైన సంగీతం, వినోద కార్యక్రమాలు తిలకించే ఏర్పాట్లు చేయాలి. కానీ అవేం ఇక్కడ జరగడంలేదు. విద్యార్థుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సైకాలజిస్టులతో కౌన్సిలింగ్‌లు ఇప్పిస్తూ మానసికస్థితిని తెలుసుకోవాలి. ఒంటరిగా ఉండే విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిచి గతంలో ఎలా ఉండేవారు? ఇప్పుడు ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు అనే విషయాలు చర్చించాలి. క్యాంపస్ అధికారులు మార్చలేకపోయిన ఒంటరితనాన్ని గుర్తించి కుటుంబ సభ్యులైనా వారికి మనోధైర్యం కల్పించి ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల పరిస్థితులు తెలుసుకుని వారి మనసుకు అనుగుణంగా నడుచుకుని ఆత్మహత్యలకు అడ్డుకట్టవేయాలని పోషకులు కోరుతున్నారు.

నాటి ప్రభుత్వంలో బాసర ట్రిపుల్‌ఐటీలో ఆంక్షలపేరుతో ఎవరినీ అనుమతించలేదు. గతేడాది డిసెంబర్ 7న తెలంగాణ రాష్ట్ర సీఎంగా ప్రమాణం స్వీకారం చేసిన రేవంత్ రెడ్డి ప్రగతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చారు. ప్రగతిభవన్ ఎదుట ఉన్న ఇనుప కంచెను తొలగించారు. అక్కడే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. కానీ బాసర ట్రిపుల్‌ఐటీలో మాత్రం నేటికీ పాత ఆంక్షలే

సీఎం సార్ వస్తేనే...

కొనసాగిస్తున్నారు. క్యాంపస్ చుట్టూ ఉన్న భారీ ప్రహరీ దాటి లోనికి ఎవరూ వెళ్లలేరు. పైగా తల్లిదండ్రులను కూడా అనుమతించడం లేదు. ఇంటి నుంచి వండుకొచ్చిన భోజనాలు విద్యార్థులకు పెడదామన్నా పంపించడం లేదు. క్యాంపస్‌కు ఇరువైపులా భారీ గేట్లు నిర్మించి ఎవరినీ అనుమతించడం లేదు. విద్యార్థులకు సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా కల్పించడంలేదు. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా బాసర ట్రిపుల్‌ఐటీకి వచ్చి సమస్యలు తెలుసుకుని శాశ్వత పరిష్కారానికి మార్గం చూపుతారని ఇక్కడి విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి



పోశమల్లు మృతదేహం

బెల్లంపల్లిరూరల్: విద్యుత్‌షాక్‌తో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై జి.నరేశ్, ఏ ఎస్సై రాజన్న తెలి పిన వివరాల ప్రకారం మండలంలోని బుధాకుర్దు గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు మేడం పోశమల్లు (73) ఇంట్లో ఆదివారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. దీంతో ఇంటిపరిసరాల్లో విద్యుత్ తీగలను సవరిస్తున్న క్రమంలో షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై రాజన్న తెలిపారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

శ్రీరాంపూర్: కార్మికుల హక్కుల కోసం నిరంతరంగా పోరాడాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు టీబీజీకేఎస్ నేతలకు సూచించారు. ఇటీవల ఎన్నికైన టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, తదితరులు ఆదివారం దివాకర్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని శాలువాతో సత్కరించారు. నూతనంగా ఎన్నికైన నేతలు ఉత్సాహంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పెండ్రి అన్వేశ్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మస్యాల రమేశ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



సభ్యులను సన్మానిస్తున్న దివాకర్‌రావు

మైనింగ్ స్టాఫ్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ ఆర్కే 6 గని పిట్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గనిపై జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచి సెక్రెటరీ ఎస్కే బాజీసైదా హాజరయ్యారు. కమిటీ ఉపాధ్యక్షునిగా మోతె రమేశ్, కార్యదర్శిగా కిన్నెర చంద్రమౌళి, సహాయ కార్యదర్శిగా కేదారి రమేశ్, రిలే ఏ కార్యదర్శిగా ముద్దసాని అనుదీప్, రిలే బీ కార్యదర్శిగా బొడ్డు సాయికృష్ణ, రిలే సీ కార్యదర్శిగా తాళ్ల రవికుమార్, జనరల్ షిఫ్ట్ కార్యదర్శిగా బోయిన నరసయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నూతన కమిటీ మైనింగ్ స్టాఫ్ హక్కులు, సదుపాయాల కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ ఏరియా ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి మారుపల్లి బాపు, గని పిట్ సెక్రెటరీ సంఘం సదానందం పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కమిటీ

రైలుకు తగిలి ఒకరికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

మంచిర్యాలక్రైం: రైలుకు తగలడంతో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని రైలుకు తగలడంతో తీవ్రగాయాలై కిందపడిపోయాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తెలిసినవారు 8328512176, 8712658596 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

చైన్ అపహరణ

నస్పూర్: స్థానిక జగదాంబ కాలనీకి చెందిన ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి చైన్ చోరీకి పాల్పడినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. కాలనీకి చెందిన ముస్కె భాగ్యలక్ష్మి ఆదివారం ఆటో దిగి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకనుంచి బైక్‌పై వచ్చిన వ్యక్తి ఆమె మెడలోంచి సుమారు 5 తులాల బంగారు చైన్ లాక్కెల్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ ఎన్నిక



చొప్పరి శ్రీహరి, ఉపాధ్యక్షుడు

కాసిపేట: మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీని ఆదివారం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చొప్పరి శ్రీహరి, కార్యదర్శిగా శంకరయ్య, సహాయ కార్యదర్శిగా ప్రశాంత్, రిలే ఏ ఇన్‌చార్జిగా శ్రీనివాస్, రిలే బీ ఇన్‌చార్జిగా దినేష్, రిలే సీ ఇన్‌చార్జిగా ఉదయ్, మహేందర్, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జిగా రాజు, వర్క్ మెన్ ఇన్‌స్పెక్టర్‌గా రంజిత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి వి.రాజేందర్, నాయకులు పార్వతి సురేష్, లింగయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ జీఎంగా శ్రీనివాసులు



శ్రీనివాసులు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు జీఎంగా కె.శ్రీనివాసులు పదోన్నతి పొందారు. ఇంతకాలం జీఎంగా విధులు నిర్వర్తించిన చిన్న బసివిరెడ్డి ఆదివారం పదవీ విరమణ పొందగా ఎస్టీపీపీ ఎఫ్ జీఎండీ నిర్మాణంతో ఏజీఎంగా విధులు చేపట్టి ఇప్పుడు పీసీఎస్ ఏజీఎంగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులుకు పదోన్నతి కల్పిస్తూ సింగరేణి సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది.

బెదిరించి లైంగిక దాడి చేసిన ఒకరి రిమాండ్

భీమిని: కన్నెపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మహిళను బెదిరిస్తూ రెండేళ్లుగా అత్యాచారానికి పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. మండలంలోని మెట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధి లోని ఏసయ్యపల్లి గ్రామానికి చెందిన గోమాస దేవదాస్ రెండేళ్లుగా ఓ మహిళను బెదిరిస్తూ అత్యాచారానికి పాల్పడుతున్నాడు. తన కుటుంబాన్ని సైతం వేరు చేస్తానని భయభ్రాంతులకు గురిచేయడంతో బాధిత మహిళ కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శనివారం రాత్రి బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గనిలో స్పృహతప్పి పడిపోయిన ప్రైవేటు ఉద్యోగి

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో ఆదివారం ఓ ప్రైవేట్ సంస్థ ఉద్యోగి గర్మీ (వేడి)తో స్పృహతప్పి పడిపోయాడు. గనిలో కొంతకాలం నుంచి జేఎంఎస్ అనే సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సంస్థ తరఫున ఆదివారం ప్రీషిఫ్టుకు షరీఫుల్ల ఇస్లాం అనే ఉద్యోగి విధులకు వెళ్లాడు. గని భూగర్భంలో దిగి 67 లెవల్‌లో సపోర్టు పనులు చేస్తుండగా వేడికి తాళలేక కళ్లుతిరిగి పడిపోయాడు. వెంటనే సహచర కార్మికులు సపర్యలు చేసి గని అధికారులకు సమాచారం అందించారు. అనంతరం స్థానిక కంపెనీ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గనిలో తగినంత గాలి సరఫరా కాకపోవడం వల్లనే సదరు కార్మికుడు స్పృహ కోల్పోయాడని కార్మికులు పేర్కొంటున్నారు. గని అధికారులు గాలి సరఫరా మెరుగు పరిచి కార్మికుల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

సీపీఐ రాష్ట్ర సమావేశాల్లో ఉమ్మడి జిల్లా నాయకులు

ఎదులాపురం: ఖమ్మం జిల్లా కేంద్రంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర సమావేశాలకు ఉమ్మడి ఆదిలాబాద్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ హాజరయ్యారు.